నమస్తే తెలంగాణ
మెదక్
11 | హైదరాబాద్, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | MEDAK



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో
రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

స్వయం పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 17: 'స్వయం పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష' అని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం గజ్వేల్‌లోని కేసరి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ పచ్చని పాడిపంటలతో సుభిక్షంగా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణను ముందు వరుసలో ఉంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ అభివృద్ధి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని, కేసీఆర్ అంటేనే తెలంగాణ, తెలంగాణ అంటేనే కేసీఆర్‌గా పదేండ్ల పాలనలో కనపడిందన్నారు. తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని తాగు, సాగునీటి రంగాల్లో ముందు వరుసలో ఉంచారన్నారు. కాళేశ్వరం, కొండపోచమ్మ, మల్లన్నసాగర్ లాంటి అనేక రిజర్వాయర్లు నిర్మించి మండుటెండల్లో సైతం రైతులకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమంలో గజ్వేల్ దాదాపు యాభై ఏండ్ల ముందుకెళ్లిందన్నారు. గజ్వేల్ పరిధిలో ప్రాజెక్టులను నిర్మించి కూడవెల్లి, హల్దీవాగులను జీవనదులుగా మార్చారన్నారు. అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, అటవీ కళాశాల ఏర్పాటు చేశారని, బాలికలు, బాలుర విభాగాల్లో ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెండ మధు, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్, నాయకులు ఉడేం కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రాజిరెడ్డి, గొడుగు స్వామి, వాసీంఖాన్, రవీందర్, అహ్మద్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ కేసరి హనుమాన్ దేవాలయం వద్ద కేక్‌కట్ చేస్తున్న
ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో
ఆయుష్యహోమంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు

ఎర్రవల్లిలో కేసీఆర్ బర్త్‌డే

ఆయుష్య హోమం నిర్వహించిన గ్రామస్తులు

మర్కూక్, ఫిబ్రవరి 17: గులాబీ అధినేత కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. శనివారం ఆయన దత్తత గ్రామం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నిండు నూరేళ్లు జీవించాలని, రాష్ట్రానికి మరిన్ని సేవలు అందించాలని భగవంతుడిని ప్రార్థించారు. దేశానికే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బాలరాజు, భాగ్యాభిక్షపతి, ఎంపీటీసీ తుమ్మకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

శేతేమాానం ధేవేతి

సబ్బుపై కేసీఆర్ చిత్రం

గజ్వేల్, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ పుట్టినరోజు సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు సబ్బుపై ఆయన చిత్రాన్ని గీశాడు. సబ్బుపై 'రైతు బాంధవుడా' అని కేసీఆర్ చిత్రం గీసి అభిమానాన్ని చాటుకున్నాడు.

బీఆర్ఎస్ మెదక్ కార్యాలయం, ఏడుపాయలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఘనంగా గులాబీ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు, అన్నదానాలు

దవాఖానల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజానాయకుడికి సబ్బండ వర్గాల ఆశీర్వాదం

మనోహరాబాద్ మండలం కూచారంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న
ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రాకల హేమలతాశేఖర్‌గౌడ్

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గులాబీ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్ చేశారు. ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ఆయన వందేండ్లు చల్లగా ఉండాలని దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. దవాఖానల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు సబ్బుపై కేసీఆర్ చిత్రం గీసి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపాడు.

- ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 17

మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

కష్టపడి చదవాలి

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషిచేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. హవేళీఘనపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈవో రాధాకిషన్, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను టీవీ, ఫోన్లు, సోషల్‌మీడియాకు దూరంగా ఉంచాలని, చదువుతున్నారో లేదో గమనించాలన్నారు. ప్రత్యేక తరగతులు, గ్రాండ్ టెస్ట్‌లను సద్వినియోగ పరుచుకోవాలని, పిల్లలు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని, చదువు తప్ప ఇతర పనులు చెప్పొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం హవేళీఘనపూర్‌లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హవేళీఘనపూర్ తహసీల్దార్ నారాయణ, కరుణాకర్, నీలకంఠం, సుదర్శన మూర్తి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ రమేశ్, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న పరీక్షలకు జిల్లాలో 13,173 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, మొదటి సంవత్సరంలో 6,507 మంది, రెండో సంవత్సరంలో 6666 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 30 కేంద్రాలు ఎంపిక చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు. 30 శాఖాధికారులతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, 4 సిట్టింగ్ స్క్వాడ్, 5 కస్టడీయన్స్ టీమ్‌లు, ప్రశ్నాపత్రాల స్టోరేజీకి 14 పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులు నడపాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని డీఈవో, ఇంటర్మీడియేట్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి సత్యనారాయణ, డీఈవో రాధాకిషన్, శశిధర్, అశోక్, పోలీసు, పోస్టల్, ఆర్‌టీసీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిండు నూరేళ్లు జీవించాలి

సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరు, ఫిబ్రవరి 17: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిండు నూరేళ్లు జీవించాలని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. కేసీఆర్ 70వ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని శనివారం చిన్నకోడూరులోని నాయకమ్మ దేవాలయంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డితో కలిసి ఆమె పూజలు చేసి అక్కడే మొక్క నాటారు. అనంతరం చిన్నకోడూరు బస్టాండ్ ఆవరణలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పేదలకు మరిన్ని సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ రామచంద్రం, వెంకటేశం, గంగపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు వేణు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న
జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

నేడు 'మల్లన్న' ఐదో ఆదివారం

చేర్యాల, ఫిబ్రవరి 17 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో నేడు ఐదో ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడంతోపాటు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఐదో ఆదివారానికి సుమారు 50వేల మంది భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామివారి క్షేత్రానికి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నం వేసి బోనం సమర్పించుకోనున్నారు. మహా మండపం, గంగరేగుచెట్టు ఆవరణతో పాటు తాము బసచేసిన గదుల వద్ద పట్నాలు వేయనున్నారు. మరికొందరు భక్తులు మల్లన్నగుట్టపైన ఎల్లమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలి వెళ్లనున్నారు. స్వామి వారి క్షేత్రానికి తరలివచ్చే భక్తుల కోసం ఆలయ ఈవో ఎ.బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కొందరికే గృహజ్యోతి..!

నమోదుకు నేటితో ముగియనున్న గడువు

పథకం అమలు మరింత ఆలస్యమయ్యే అవకాశం

సంగారెడ్డి, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు నివాస గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు కాంగ్రెస్ సర్కారు గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఈనెల 8వ తేదీ నుంచి విద్యుత్ సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో వివరాలు నమోదు చేసుకుంటున్నారు. పేర్ల నమోదుకు 15వ తేదీ తుది గడువుగా ప్రభుత్వం తొలుత ప్రకటించింది. కానీ, 15వ తేదీ వరకు పేర్ల నమోదు ప్రక్రియ వందశాతం పూర్తికాక పోవడంతో గడువును ఈనెల 18 వరకు పొడిగించింది. ఇప్పటి వరకు సగం మంది మాత్రమే వివరాలు నమోదు చేయించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే గడువు ఉండడంతో వందశాతం నమోదయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఈ పథకం ఇప్పట్లో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో అందరికీ ఈ పథకం వర్తింపజేస్తామని ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక తెల్లరేషన్‌కార్డుదారులకు మాత్రమే వర్తింపజేస్తామని ప్రకటించింది. దీంతో తెల్లరేషన్ కార్డు లేనివారు ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు. ప్రస్తుతం తెల్లరేషన్‌కార్డు ఉన్న వారి వివరాలను మాత్రమే విద్యుత్ సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. తెల్లరేషన్‌కార్డు లేనివారు చాలామంది పేదలు ప్రజాపాలనలో కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి గృహజ్యోతి పథకం వర్తింపజేసే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది. కఠిన నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంగారెడ్డి జిల్లాలో 2.29 లక్షల మంది పేర్లు నమోదు...

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 5,50,254 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో నాలుగు విద్యుత్ సబ్ డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు 2,29,521 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలో 69,177, పటాన్‌చెరులో 46,007, జహీరాబాద్‌లో 55519, జోగిపేటలో 58,818 మంది పేర్లను నమోదు చేశారు. ఇంకా 3,20,733 వినియోగదారుల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంది. పల్లెల్లో దాదాపుగా పేర్ల నమోదు ప్రక్రియ పూర్తి కాగా, పట్టణాల్లో 60శాతం వరకు మాత్రమే పూర్తయినట్లు తెలిసింది. ప్రభుత్వం గడువును పొడిగించపోతే చాలామంది నష్టపోయే అవకాశం ఉంది.

మెదక్ జిల్లాలో 75 శాతం పూర్తి

మెదక్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో 1.60 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి కోసం ఇప్పటి వరకు లక్షా20 వేల మంది లబ్ధిదారుల వివరాలను సేకరించారు. మరో 40వేల మంది వివరాలు సేకరించాల్సి ఉంది. నమోదు ప్రక్రియ 75 శాతం పూర్తయిందని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి బ్రహ్మారావు తెలిపారు.

బీఆర్ఎస్‌పై కక్ష సాధింపు చర్యలు

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్: మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, ఫిబ్రవరి 17 : అబద్ధాలు, అసత్యాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం అందోల్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలిచిందని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎంగా లేని తెలంగాణను చూడలేకపోతున్నామని, ప్రజలు ఎంతో ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రతిపక్ష పాత్రను సైతం మరింత బాధ్యతగా నిర్వర్తిస్తామని, ప్రజల పక్షాన మరింత గట్టిగా గొంతుకను వినిపిస్తామన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నదని, తమకు కేసులు కొత్త మీకాదన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపుతూ అలుపెరుగకుండా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఎంపీపీ బాలయ్య, మాజీ ఎంపీపీ రామాగౌడ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పనులన్నీ తుదిదశకు
- మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 17 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పూర్తి చేయడంతోపాటు కొత్తవాటిపై దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాలపై మాట్లాడారు. పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. గతంలో తాను చేసిన ప్రయత్నం మేరకు ప్రస్తుతం ఆ ఫైల్ (21912/da/2019) ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నదన్నారు. తడ్కల్ మండలం ఏర్పాటు అంశం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని, ఎన్నికల కారణంగా నిలిచిపోయిందన్నారు. తడ్కల్ మండలం ఏర్పాటులో గతంలో రాజకీయం చేశారని, ఈ రెండు అంశాలపై చిత్తశుద్ధి ఉంటే సాధించాలన్నారు. ఎమ్మెల్యే మరో విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తూ నల్లవాగు ప్రాజెక్టు కట్టుకాల్వ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తేవడం నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టును ఎండబెట్టే రీతిలో ఉన్నదన్నారు. 1493 అడుగుల ఎఫ్‌టీఎల్ ఉన్న నల్లవాగు ప్రాజెక్టు నీటిని 1383 అడుగుల వద్ద నిజాంసాగర్‌కు మళ్లిస్తే కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి మండల రైతులకు నష్టం జరిగే అవకాశం ఉన్నదన్నారు. అవసరమైతే ఎమ్మెల్యే దీనిపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే ఇలాంటి ప్రతిపాదనలను పక్కన పెట్టి బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు. సమావేశంలో సిర్గాపూర్ ఎంపీపీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పరశురామ్ పాల్గొన్నారు.